# జాస్మిన్

**చ**దువుతున్న పుస్తకంలోంచి తలెత్తి చూశాడు గోపాలకృష్ణ. ఎదురుగా ఒక స్త్రీ. తెల్లగా, పల్చగా ముఖంలో గూడుకుట్టుకున్న విచారం. వయసు పాతికలోపు. అంత దీనావస్థలోనూ చెదరని అందం. అమాయకంగా ఉంది. ఏమీ మాట్లాడకుండా నిలుచుంది. ఆమె ఏదో చెప్పబోయేంతలో పక్కనే ఉన్న శరత్ 'మిత్రమా...! ఆమె మాట్లాడదు. ఈమె మౌనాన్ని అనువదిస్తే నాకర్థమయిన విషయం, ఈమెకు డబ్బు కావాలి, భర్తో, కొడుకో చావు బతుకుల్లో ఉన్నారు. అంతే కదా!" అన్నాడు.

ఆమె సమాధానం ఇవ్వకుండా నిర్లిప్తంగా ఊరుకుంది. గోపాలకృష్ణ జేబులోంచి నోట్లు తీసి ఇవ్వబోయాడు.

ఆగు మిత్రమా! నువ్వో ఫిలాంత్రపిస్ట్‌వని తెలుసు,కానీ ఆమెలాంటి కాస్ట్‌లీ బెగ్గర్స్‌ని తెలిసి మరీ ప్రోత్సహించడం..

శరత్ మాటలు పూర్తి కాకుండానే గోపాలకృష్ణ తన చేతిలోని డబ్బును ఆమెకు అందించాడు. ఆమె మెట్లు దిగి వేగంగా నడుచుకుంటూ వెళ్లిపోయింది.

శరత్, వెళుతున్న ఆమె వంక చూస్తూ,

"నువ్ బాచిలర్‌వి, ఇంజనీరువి, చేతికి ఎముక లేకుండా దానం చేస్తున్నావని తెలిస్తే ఈమెలాంటి గౌరవ బిచ్చగాళ్ళు మీ ఇంటి ముందు క్యూలు కడుతూ నిలుచుంటారు. ఇంతకీ ఈమె గురించి నా ఊహ చెప్పనా? ఆమె ఏ అమావాస్య రాత్రో తన యవ్వనాన్ని ఏ మృగానికో అర్పించుకొని ఉంటుంది. బదులుగా ఆమెను ఆ చీకట్లోనే ఉండమని శాసిస్తూ ఆ మృగం ఈ జనారణ్యంలో ఆమెను ఒదిలి పారిపోయి ఉండొచ్చు. దిక్కులేని చెల్లి, పతనమైన పిచ్చితల్లి. ఆమె చీకటి చరిత్రకు సాక్షి ఆ జాబిల్లి" అన్నాడు శరత్ కవితా ధోరణిలో.

గోపాలకృష్ణ ఆ మాటలకు బాధపడుతూ "ఆమె కళ్లు చూశావా? ఆ కళ్ళల్లో కాముకత లేదు. కరుణ వెలుగుతోంది..." అన్నాడు.

గోపాలకృష్ణ బాధపడుతున్నాడని మౌనంగా ఉండిపోయాడు శరత్.

గోపాలకృష్ణ బాల్కనీ మీద నుంచి కింద వెళుతున్న మనుషుల్ని చూస్తున్నాడు.

సాయంసంధ్య వీడిపోతోంది. చీకటి పల్చటి తెరలుగా విస్తరిస్తోంది. మేడ మీద నించి చూస్తుంటే నగరం దీప సుందరిలా సాక్షాత్కరిస్తోంది.

గోపాలకృష్ణ మనసులో ఏదో గుబులు. నేటి నాగరికత మానవుడి దోపిడిలో మొదటి విక్టిమ్ మానవి (స్త్రీ). ఏ స్త్రీ అయినా పతనం చెందడానికి ప్రథమ కారణం పురుషుడే అనీ, అయనా స్త్రీనే సమాజం నిందిస్తుందనీ అతడి ఆవేదన.

కొద్ది క్షణాల తర్వాత శరత్, తన మిత్రుడి ముఖంలోకి చూశాడు.

అసలే సెన్సిటివ్ మనిషి, దానికి తగ్గట్టు ఎవరికైనా అన్యాయం జరిగితే దిగులు పడతాడు. తనకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధం లేకపోయినా, ఇలాంటి వారిని ఏమనాలి? మహాత్ములా!

తన మిత్రుడిని తలుచుకుంటే సంతోషం కలిగింది శరత్‌కు ఆ సమయంలో అలా ఆ సాయంకాలప్పూట వచ్చిన ఆ అనామక స్త్రీ గురించి అతడెందుకు కలత చెందుతున్నాడో అర్థం కాక, మిత్రమా ఆమె నీకు తెలుసా? అనడిగాడు. గోపాలకృష్ణ చెప్పడం ప్రారంభించాడు.

"ఆమె పేరు జాస్మిన్. ఆమె భర్త మా కంపెనీ కనస్ట్రక్షన్ సైటులో వేన్ డ్రైవర్. నెల క్రితం సరుకు లోడ్ చేస్తుంటే ప్రమాదవశాత్తూ మిషన్ కిందకు వెళ్ళిపోయాడు. కాళ్లు రెండూ తెగిపోయాయి. అతడి నిర్లక్ష్యంవల్లే అలా జరిగిందని మేనేజ్‌మెంట్ ఆసుపత్రి ఖర్చులు మినహా ఏ కాంపన్సేషనూ ఇవ్వలేదు. పైగా వర్క్‌మెన్స్ కాంపన్సేషన్ పాలసీలో అతని పేరు లేదు. దానికి మేనేజ్‌మెంట్ మాత్రమే బాధ్యత వహించాలి." అన్నాడు గోపాలకృష్ణ.

"అయ్యో, చాలా దురదృష్టం అయినా వర్కర్ల యూనియన్ ఏం చేస్తోంది.. సహాయం చేయవచ్చు కదా..." అన్నాడు శరత్.

"యూనియన్ లీడర్ మేనేజిమెంట్ చేతుల్లో మనిషి, జాస్మిన్‌కు ఆ విధంగా అన్యాయం జరిగింది. పైగా ఆమెకు ఇక్కడ నా అన్నవాళ్లు లేరు. ఆమెది కేరళ ప్రాంతం. ఇంట్లోంచి వాళ్ళిద్దరూ చెప్పకుండా వచ్చేశారు. అలా పెద్దల్ని ఎదిరించి వచ్చిన ఆ ప్రేమ జంట బతుకులో చీకటి మిగిలింది."

"మరి నువ్వు మీ జిఎంతో మాట్లాడలేకపోయావా? ఆయన నీతో క్లోజ్‌గా ఉంటాడు కదా... అన్నాడు శరత్.

అసలేం జరిగిందంటే స్వీపర్ పోస్టయినా ఇమ్మని రెండు రోజుల క్రితం ఆయన దగ్గరకొచ్చింది మా జీఎమ్ సంగతి తెలుసుకదా, యాభయ్యేళ్ళు దాటినా ఇంకా అమ్మాయిల వెంటే పడతాడు. ఆమెను చూడగానే తన వయసు మరిచిపోయాడు. పెళ్ళికి ఎదిగిన తన కూతుర్ని మరిచిపోయాడు. ఆమెకు ఉద్యోగం కావాలంటే తన కోరిక తీర్చాలన్నాడు. ఆమె అతడిని బతిమాలింది. తనను పతనం చెయ్యొద్దని ఏడ్చింది."

"అబ్బ... అంతటి నరరూప రాక్షసుడా మీ జీఎమ్. మిగతా వాళ్లేం చేస్తున్నారు. దీనిని ఖండించలేకపోయారా?" అన్నాడు శరత్.

"నేను వెళ్ళి జీఎమ్‌తో మాట్లాడాను. నన్ను తిట్టి పంపేసాడు. అయితే మిగతా వారితో కలసి నేను మేనేజింగ్ డైరెక్టర్‌కు కంప్లయింట్ చేశాను. మన జీఎమ్‌ని ఇక్కడ బదిలీ చేసేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి."

"వెరీ గుడ్... ఆ దుర్మార్గుడికి తగిన శాస్తి జరిగింది. మరీ ఈమె సంగతి ఏమిటి?"

"ఈమె మంచిది కాదు. అందరినీ చెడగొడుతుంది. అంటూ మిగతా కంపెనీలకు ఫోన్ చేసి చెప్పాడు జీఎమ్, వేరే చోట ఈమెకు ఏదైనా చిన్న ఉద్యోగం వేయిద్దామన్నా వీలుకాని పరిస్థితి. ఇలా ఆమెకు వచ్చిన అవకాశాలన్నీ చేజారిపోతున్నాయి. ఏదో ఒక రోజు ఏ చీకటి రాత్రో ఆమె పతనం కావలసిందేనా... విపణి వీధిలో వినియోగపు సరుకుగా మారవలసిందేనా... ఆమె కథ ఏ విధంగా ముగుస్తుందో... చెప్పడం ఆపి నిట్టూర్చాడు గోపాలకృష్ణ బాధగా.

"మరి ఈమె సమస్యకు పరిష్కారం ఏమిటి?" శరత్ అడిగాడు, గోపాలకృష్ణ చెప్పిన మాటలకు తనూ ఆవేదన చెంది.

"మా ఆఫీసులో అందరం కలసి కొంత డబ్బు పోగు చేశాం. ఏదో తాత్కాలికంగా సహాయం చేద్దామని, అందుకే ఆమె వచ్చింది. నా భయం ఏమిటంటే ఈ దుర్భర జనారణ్యంలో ఈ ఒంటరి స్త్రీ బతుకు ఎలా ముందుకు సాగుతుందో.. తనను ప్రేమించిన భర్త అంటే ఈమెకు ప్రాణం... అతడిని పోషించేందుకు ఏదో ఒకరోజు ఆమె చీకట్లోకి నడవక తప్పని పరిస్థితి వస్తుందేమో..." అన్నాడు గోపాలకృష్ణ దిగులుగా.

శరత్ అతడి మాటలకు ఆలోచనలో పడ్డాడు.

* * * * *

వారం రోజుల తర్వాత స్కూటర్ మీద వెళుతున్న గోపాలకృష్ణ, శరత్‌లకు జాస్మిన్ కనిపించింది.

ఆమె ముఖం పాలిపోయి ఉంది. ఓపిక లేనట్లు నడుస్తోంది. వారు చూస్తుండగానే ఒక ఆస్పత్రిలోకి వెళ్ళింది. ఇద్దరూ కలవాల్సింది ఆ ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్‌ని. స్కూటర్ పార్క్ చేసి లోపలకు అడుగుపెట్టారు.

"బజారున తిరిగే ఆడవాళ్ల బతుకులు చివరికి ఆస్పత్రి పాలే." లోపలికి వెళుతున్న ఆమెను చూస్తూ కామెంట్ చేసాడో యువకుడు, ఆ ఆస్పత్రి గేటు ముందు కూర్చుని సిగరెట్టు కాలుస్తూ.

గోపాలకృష్ణ ఆ మాటలకు ఆగిపోయాడు. శరత్ ఆ యువకుడిని ప్రశ్నించాడు... "ఆ అమ్మాయి నీకు తెలుసా?" అని

"తెలియకేం... ముఖం చూస్తే తెలియడం లేదా... ఇప్పటికి నాలుగు సార్లు ఆ ఆస్పత్రి దగ్గర కనిపించింది..." ఆ యువకుడు ఇంకా ఏదో చెప్పబోయాడు. గోపాలకృష్ణ మరి వినలేకపోయాడు. ఆస్పత్రిలోకి నడిచాడు. శరత్ అతడిని అనుసరించాడు. కన్సల్టింగ్ రూములో డాక్టరు లేకపోవడంతో వార్డు లోపలికి ప్రవేశించారు.

తమకు కనిపించిన ఆ దృశ్యం చూసి ఇద్దరూ కొయ్యబారిపోయారు.

ఎదరుగా బెడ్ మీద జాస్మిన్. ఆమె శరీరానికి తగిలించిన సూది నుంచి ఒక్కొక్క బొట్టుగా రాలుతున్న రక్తం. అవిటివాడైన భర్తను పోషించుకునేందుకు రక్తాన్ని అమ్ముకుంటున్న నిర్భాగ్యురాలు.

ఆమెను ఆ స్థితిలో చూసిన గోపాలకృష్ణకు కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

"ఇప్పటికి ఇది నాలుగోసారి ఆమె రక్తాన్ని ఇవ్వడం. వద్దన్నా వినకుండా వస్తోంది. యూనివర్సల్ డోనర్. అందుకే కాదనలేకపోతున్నాం." అన్నాడు అప్పుడే

వచ్చిన డాక్టరు

గోపాలకృష్ణ మరింత కదిలిపోయాడు.

పావుగంట తర్వాత డాక్టర్ గారితో మాట్లాడి ఇద్దరూ భారంగా కదిలారు. అక్కడ నుంచి.

* * * * *

సంవత్సరం తర్వాత

ఒక చీకటి రాత్రి. మెస్‌లో భోజనం చేసి నడుచుకుంటూ వస్తున్నాడు గోపాలకృష్ణ.

గోపాలకృష్ణకు ఎదురుగా ఒక ఆకారం. దగ్గరకంటూ వచ్చేసింది. ఎముకల గూడులా ఉన్న శరీరం. చర్మం తెల్లగా పాలిపోయి ఉంది. చూడడానికి ఒక పిండిబొమ్మలా, ఈజిప్షియన్ మమ్మీలా ఆమెను అతడు గుర్తు పట్టాడు. అతడి కడుపులో పేగు కదిలింది.

ఆమె నడుచుకుంటూ వెళ్లిపోయింది అతని ముందే. జేబుల్లోంచి డబ్బులు తీసి ఇవ్వబోయాడు. ఆమె గమనించలేదు. పేరు పెట్టి పిలిచాడు. ఆమె తల తిప్పింది. ముందుకెళ్ళి డబ్బులు అందించాడు. ఇంతలో ఆకాశంలో ఒక మెరుపు. ఆ వెలుగులో కనిపించింది. అతనికి ఆమె మెడలోని పసుపుతాడు. ఆమె వెళ్ళిన వైపే చూస్తూ గబగబా నడిచాడు రూము మెట్లెక్కుతున్నాడు. పక్కింటివారి మేడమీద నుంచి పాకిన మల్లెతీగ తన రూము వరకూ పాకింది. ఆ ఇంటి ఇల్లాలు కాసిన్ని మల్లెపూలు కోసింది. చక్కటి పరిమళం గోపాలకృష్ణ ముక్కు పుటాలను తాకింది.

“కాసింత పసుపు, కాసింత కుంకుమకు మగవాడిని నమ్మడం, బతుకు అమ్మడం...” ఎక్కడినించో లీలగా వస్తున్న పాట.

ఈ మల్లెల గుభాళింపు రేపటికుండదు. మరి జాస్మిన్ నువ్వు...!

జాస్మిన్ గురించిన ఆలోచనల్లో ఉన్న గోపాలకృష్ణ మనసునిండా దిగులు మేఘాలు.

– 'మాటు' కథా సంకలనం. సెప్టెంబరు 2004.

* * * * *